క్లుప్తంగా

జిమ్నాస్టిక్స్ పోటీల్లో సిమ్స్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు మెడికల్: విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సిమ్స్ మై స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటినట్లు సిమ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ భీమనాథం భరత్‌రెడ్డి తెలిపారు. రిథమిక్ ఈవెంట్‌లో అండర్–8 బాలికల విభాగంలో షేక్ హఫ్సా ప్రథమ స్థానం, భీమ్ ఈవెంట్ అండర్–10 బాలికల విభాగంలో షేక్ నష్వా పర్వీన్ ప్రథమ స్థానం, ఫ్లోర్‌రింగ్ టేబుల్ వాల్ట్ ఈవెంట్‌లో అండర్–12 బాలుర విభాగంలో షేక్ ముఫాసిర్ అహ్మద్ ప్రథమ స్థానం, ఆర్టిస్టిక్ ఈవెంట్‌లో సబ్‌జూనియర్ బాలుర విభాగంలో షేక్ ఆరీజ్ ద్వితీయ స్థానం సాధించారని ఆయన వివరించారు. గుంటూరు మంగళదాస్ నగర్‌లోని సిమ్స్ కార్యాలయంలో శనివారం విజేతల్ని సిమ్స్ కరస్పాండెంట్ డాక్టర్ శివ శిరీష అభినందించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



పాత గుంటూరు: సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు 7వ లైనులో గల శ్రీ సీతారామస్వామి మందిర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం వేద పారాయణాలు, యంత్ర పునఃశ్చరణ, మృత్తికా స్థాపన, హోమాలు, జలాధివాసం తదితర పూజల్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. మందిర సొసైటీ అధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, కార్యదర్శి కల్లి సుందరరామిరెడ్డి, కోశాధికారి బి. వెంకటేశ్వరరావు, సభ్యులు కల్లి శ్రీనివాసరెడ్డి, కట్టా శ్రీనివాసరావు, బత్తినేని భావనకృష్ణ, ఎల్. జయలక్ష్మి పర్యవేక్షించారు.

లెనిన్‌కు ఘన నివాళి



పాత గుంటూరు: కొత్తపేట సీపీఐ కార్యాలయంలో ప్రపంచ ప్రప్రథమ సోషలిస్టు రాజ్యస్థాపకుడు కామ్రేడ్ వి. ఐ.లెనిన్ 99వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇప్టా జాతీయ అధ్యక్షుడు గని, సీపీఐ నగర సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, సీహెచ్.విజయ్ కుమార్, చల్లా మరియదాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, నగర అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు జ్ఞానదీప్, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు స్పందన



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ''ఆడపిల్లను రక్షించండి'' అనే అంశంపై విద్యార్థులకు జిల్లాస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల రూపంలో వరుసగా రూ.10వేలు, రూ.ఐదు వేలు, రూ.మూడు వేల చొప్పున నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని ఈనెల 24న కలెక్టర్ చేతుల మీదుగా అందజేస్తామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జె. హనుమంతరావు తెలిపారు.

నేడు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: చిప్స్ కల్చరల్ ఈవెంట్స్, మధువని సుస్వరాల పల్లకి సంయుక్త ఆధ్వర్యంలో రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం సుస్వరాల జల్లు పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎండీ. పర్వేజ్ చిష్టి, మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో స్థానిక గాయకులు తెలుగు, హిందీ పాటలను ఆలపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

26 నుంచి నగరంలో ఫ్లెక్స్ బ్యానర్లు నిషేధం

మేయర్ కావటి, కమిషనర్ కీర్తి



ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో మాట్లాడుతున్న మేయర్ కావటి, కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి గుంటూరు నగరంలో ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధం పక్కాగా అమలు చేయనున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరిలు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, హోర్డింగ్స్ ఏజన్సీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఫ్లెక్సీ బ్యానర్ల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి నిషేధం విధించిందని చెప్పారు. నగరంలో కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధం అమలుకు పక్కాగా అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. ఫ్లెక్సీల స్థానంలో ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యానర్లను వినియోగించవచ్చని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రతి చదరపు అడుగు బ్యానర్ కు రూ.100 అపరాధ రుసుం విధించనున్నట్లు వెల్లడించారు. నిషేధం అమలుపై నగరంలో శానిటరీ సూపవైజర్ ఆధ్వర్యంలో నాలుగు టాస్క్ ఫోర్స్ బృందాల్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగ అధికారుల ద్వారా రాజకీయ పార్టీల కార్యాలయాలకు, ప్రజా ప్రతినిధులకు కూడా సమాచారం, ప్రభుత్వ ఉత్తర్వులు అందిస్తామని పేర్కొన్నారు. వ్యాపార కాంప్లెక్స్‌లోని సంస్థలకు కూడా రెవెన్యూ విభాగం ద్వారా నోటీసులు ఇస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన ఫ్లెక్సీల నిషేధం అమలులో నగర ప్రజలు, వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు సహకరించాలని వారు కోరారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, నెలాఖరు కల్లా శ్లాబ్‌ల నిర్మాణం జరగాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి లబ్ధిదారులకు చెప్పారు. ఆమె శనివారం లాం గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆర్డీఓ, గృహ నిర్మాణ, నగర పాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించారు. ముందుగా లే అవుట్స్‌లో మంజూరైన ఇళ్లు, నిర్మాణంలో ఉన్న వాటి సంఖ్య వివరాలను హౌసింగ్ ఈఈ కమిషనర్‌కు వివరించారు. లే అవుట్ రహదార్లకు మరమ్మతులు చేపట్టాలని ఆమె ఆదేశించారు. లెవలింగ్ కోసం అవసరమయ్యే గ్రావెల్‌ను స్థానిక తహసీల్దార్‌తో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణ కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్ ప్రతి రోజు 30 ఇళ్ల బేస్మెంట్ లెవల్ ఇచ్చేలా చూడాలని చెప్పారు. లబ్ధిదారుల ప్లాట్‌లు, లైన్లు కనిపించేలా మార్కింగ్ చేయాలని, అందుకు ప్లానింగ్ కార్యదర్శులను కేటాయించాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు. విద్యుత్ లైన్ల వేసేందుకు ఆ శాఖాధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. లే అవుట్‌లో నగరపాలక సంస్థ నుంచి చేపట్టాల్సిన పనుల వేగవంతానికి డీఈఈ స్థాయి అధికారుల్ని ప్రత్యేకంగా నియమించి, ప్రతి రోజూ పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.ప్రభాకరరెడ్డి, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, డీఈఈ మహ్మద్ రఫీక్, హౌసింగ్ ఈఈ శంకరరావు, డీఈఈ ఆంజనేయులు, తాడికొండ తహసీల్దారు ఫణీంద్రబాబు, సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల శ్రేయస్సుకు రామ్మూర్తి కృషి

ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి



రామ్మూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, అప్పిరెడ్డి, మేయర్ కావటి

నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణుల శ్రేయస్సుకు, అభ్యున్నతికి రావు సాహెబ్ గానాల రామ్మూర్తి విశేష కృషి చేశారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం వద్ద ఉన్న రామ్మూర్తి విగ్రహం వద్ద శనివారం ఆయన 131వ జయంతి వేడుకలు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం, పండిత గానాల రామమూర్తి, డాక్టర్ రావూరి భరద్వాజ విగ్రహ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వబ్రాహ్మణ సంఘాల నేతలతో కలసి డొక్కా మాణిక్య వరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ మనోహర్ నాయుడు తదితరులు రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం బ్రిటిష్ వారితో తమిళనాడు శాసనమండలి ద్వారా రిజర్వేషన్లు కల్పించి వేలాది మంది విద్య, ఉద్యోగ ఉపాధి రంగాల్లో స్థిరపడేలా చేసిన ఆనాటి శాసనమండలి సభ్యులు పండిత గానాల రామ్మూర్తి విశ్వబ్రాహ్మణుల జాతిపితగా పరిగణించవచ్చునని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశ్వబ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలియజేశారు.నగర మేయర్ కావటి శివ నాగ మనోహర నాయుడు మాట్లాడుతూ నగరంలోని పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన విశ్వబ్రాహ్మణులకు రేషన్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్లు, పట్టణ పేదల సొంత ఇంటి స్థలాల మంజూరుకు, నిర్మాణానికి సహకరిస్తానని చెప్పారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి రాజకీయ ప్రాతినిధ్యాన్ని అన్ని స్థాయిల్లో కల్పించాలని కోరారు. రాష్ట్రంలో 25 లక్షల పైగా జనాభా కలిగిన విశ్వబ్రాహ్మణులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన మూడు వేల కిలోమీటర్ల పాదయాత్ర సందర్భంగా హామీ మేరకు శాసనమండలి సభ్యత్వాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంగలకుదుటి సుశీల, జిల్లా అధ్యక్షులు మేడూరి శివరామ బ్రహ్మం, కందెపు వెంకట్రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు ఉమ్మడోజు నాగేశ్వరాచారి, బసవపాత్రని మల్లికార్జునరావు, నగర అధ్యక్షులు కొంకేపూడి కోటేశ్వరరావు, అత్తలూరి వీరబ్రహ్మం, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర బీసీ యువజన సంక్షేమ సంఘం కుమ్మర క్రాంతి కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి లలిత్ ప్రజాపతి పాల్గొన్నారు.

జాతీయ ఫెలోషిప్‌కు కుశరాజు ఎంపిక



కుశరాజును అభినందిస్తున్న వీసీ రాజశేఖర్, రెక్టార్ వరప్రసాదమూర్తి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ పరిశోధకుడు బేతా కుశరాజు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యు.జి.సి) నేషనల్ ఫెలోషిప్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉప కులపతి పట్టేటి రాజశేఖర్, రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, వర్సిటీ కళాశాల అభివృద్ధి మండలి డీన్, ఎకనామిక్స్ విభాగాధిపతి కడిమి మధుబాబు శనివారం కుశరాజును అభినందించారు. ఎకనామిక్స్ విభాగాధిపతి కె. మధుబాబు పర్యవేక్షణలో 'పేదరికంలో ఉన్న కుటుంబాలపై డెరెక్ట్ బెనిఫిట్ స్కీం ప్రభావం' అనే అంశంపై పరిశోధన చేస్తున్న కుశరాజు గత అక్టోబర్ లో జరిగిన యూజీసీ నెట్ పరీక్షకు హాజరయ్యారు. 300 మార్కులు గాను 184 మార్కులు సాధించి జాతీయస్థాయి ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఐదు సంవత్సరాలపాటు ఫెలోషిప్‌ను పొందనున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ స్థాయి ఫెలోషిప్‌కు ఏఎన్‌యూ పరిశోధకుడు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగ అధ్యాపకులు, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

వేగం కన్నా భద్రత మిన్న:జేసీ



రక్తదానం చేస్తున్న జేసీ రాజకుమారి

పట్నంబజారు: జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో లారీ, బస్సు డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. ప్రభావతి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. జేసీ రాజకుమారి స్వయంగా రక్తదానం చేసి, రక్తదాతల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ అతి వేగం కన్నా భద్రత ఎంతో ముఖ్యమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ఏకాగ్రతను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోకూడదని, డ్రైవర్లకు సూచించారు. ప్రతి డ్రైవర్ వెనుక ఎంతో మంది విలువైన ప్రాణాలు ఉన్నాయనే విషయాన్ని మరవకూడదని చెప్పారు. వాహనాల్లో సైతం పరిమితికి మించి ప్రయాణికుల్ని ఎక్కించకూడదని తెలిపారు. మద్యం తాగడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వంటివి ప్రమాదాలకు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని చెప్పారు. హైవేల్లో సైతం నిబంధనలు పాటిస్తూ, రహదారి భద్రతను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని ఆమె సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. ప్రభావతి మాట్లాడుతూ ప్రయాణంలో ఐదు నిముషాల ఆలస్యం వల్ల వచ్చే నష్టం కంటే, త్వరగా గమ్యాన్ని చేరుకోవాలన్న తొందరపాటే ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. ర్యాష్, స్నేక్, త్రిపుల్ డ్రైవింగ్‌లు ఏ మాత్రం సరికాదని యువతకు సూచించారు. డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహనాల డ్రైవర్లపై చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు, డ్రైవర్లు, ఆర్టీవో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రావిపూడి మృతి తీరని లోటు

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: ప్రముఖ హేతువాది, బహు గ్రంథ రచయిత రావిపూడి వెంకటాద్రి మృతి సమాజానికి తీరని లోటని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలపై వెంకటాద్రి విరివిగా పుస్తకాలు రాసి బహు గ్రంథ రచయితగా కీర్తి గడించారని తెలియజేశారు. బ్రిటిష్ వారి హయాంలో గుంటూరు హిందూ కాలేజీలో చదివే సమయంలో జాతీయ జెండాను ఎగురవేశారని గుర్తు చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మాదిగలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు

నెహ్రూనగర్: మాదిగలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు సూచించారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులో శనివారం ఎకనామిక్ టైమ్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదిగలు పారిశ్రామిక రంగంలో ఎదిగేందుకుగాను ఎకనామిక్ టైమ్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ సొసైటీ ముందుకు వచ్చి ఉచితంగా వర్క్ షాపులు నిర్వహించడంతో పాటు వివిధ వ్యాపారాలపై ట్రైనింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే మాదిగలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండర్ అట్లూరి డేవిడ్ రాజు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు బి. విద్యాసాగర్, బి. రామాంజనేయులు, సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి రామయ్య, సెక్రటరీ ప్రశాంతి, ట్రెజరర్ కొమ్మల రాజేశ్వరి, జాయింట్ సెక్రటరీ నత్తల ప్రశాంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉప్పులూరి టైటస్ పాల్ పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు నివేదిక సమర్పణ

గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుశీల్‌రావుపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని ఏపీ షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతిని కలిసి తమ కమిటీఆధ్వర్యంలో చేసినవిచారణ రిపోర్టు ను డాక్టర్ ప్రభావతికి అందజేశారు. రిపోర్టును అందజేసినవారిలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మేడి ద బాబూరావు, ప్రెసిడెంట్ ఎస్.ఇస్సాక్ ఇల్సన్, వైస్ ప్రెసిడెంట్ వి.యోహన్, కె.నాగేశ్వరరావు, కోశాధికారి జేమ్స్ ఉన్నారు.

పోటీల్లో చలమయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: వివిధ సంస్థలు ఇటీవల నిర్వహించిన పోటీల్లో గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆ కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు తెలిపారు. సంగడిగుంటలోని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామకృష్ణ శారదా మిషన్, కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్, హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల, చాంబర్ ఆఫ్ కామర్స్, గుంటూరు జిల్లా వినియోగదారుల ఫోరం నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల్ని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఏ. శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలి: మేయర్



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, అంబులెన్సు వంటి అత్యవసర వాహనాల రాకపోకలకు అనువుగా వాహనదారులు, ప్రజలు సహకరించాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు కోరారు. శనివారం హిందూ కాలేజీ ట్రాఫిక్ జంక్షన్ వద్ద అస్తవ్యస్తంగా వాహనాల్ని నిలపడం వల్ల అంబులెన్సు రావడానికి ఇబ్బందిగా ఉండడం గమనించిన ఆయన వెంటనే స్పందించారు. ట్రాఫిక్ పోలీసులు, నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులతో కలసి ఫ్రీ లెఫ్ట్ వద్ద వాహనాలను తొలగించి, బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరానికి అత్యవసర వైద్యం కోసం నిత్యం ఎంతో దూరం నుంచి రోగులు వస్తుంటారన్నారు. హిందూ కాలేజీ జంక్షన్ హాస్పిటల్స్‌కు వెళ్లే ప్రధాన మార్గం కాబట్టి అత్యవసర వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా పట్టణ ప్రణాళిక, ట్రాఫిక్ పోలీస్‌లు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర వాహనాలకు కేటాయించిన ఫ్రీ లెఫ్ట్‌లో ఆటోలు, ఇతర వాహనాలు నిలిపి ఉంచితే నేరంగా భావించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా హిందూ కాలేజీ జంక్షన్ నుంచి చర్చి దాకా రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అలరించిన గాత్ర కచేరీలు



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న భవ్య హరి

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజస్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సంగీత జగద్గురు శ్రీ త్యాగబ్రహ్మ 176వ ఆరాధనా సంగీత మహోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీలు ప్రేక్షకుల్ని అలరించాయి. డాక్టర్ వెంపటి దివ్య గాయత్రి, సంస్థ ప్రధాన కార్యదర్శి శేషురాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. లఘు కచేరీల్లో పలువురు కళాకారులు గాత్రం, వీణపై శ్రీ త్యాగరాజ కీర్తనల్ని ఆలపించారు. వీరికి వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై రామరాజు కిశోర్ వాయిద్య సహకారాన్ని అందించారు. ప్రధాన కచేరీలో భవ్య హరి గానం శ్రావ్యంగా సాగింది. పలు త్యాగరాజ కీర్తనలను ఆలపించి సంగీతాభిమానుల్ని అలరించారు. వయోలిన్‌పై శివాని, మృదంగంపై బుర్రా శ్రీరామ్, ఘటంపై డాక్టర్ కె.అనీల్ కుమార్ వాయిద్య సహకారం అందించారు. తొలుత త్యాగరాజ కృతులు, రామతత్వం అనే అంశంపై శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీ కూర్మనాథన్ అనేక అంశాల్ని వివరించారు. కార్యక్రమాల్ని కార్యదర్శి ఏ.వి.మంగాదేవి, ఉపాధ్యక్షురాలు మాధవపెద్ది మీనాక్షి, డాక్టర్ ఎం. రాజరాజేశ్వరి, లలితాదేవి పర్యవేక్షించారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: దేశవ్యాప్తంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు జాతీయస్థాయిలో నిర్వహించిన క్యాట్ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు శ్రీచైతన్య పాఠశాలల గుంటూరు, ప్రకాశం జిల్లాల ఏజీఎం డాక్టర్ ఎన్. అంజయ్య తెలిపారు. రింగ్ రోడ్డులోని సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు విద్యార్థులకు మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల వారీగా నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో 4,500 మందికి నగదు బహుమతులు, 25వేల మెడల్స్ ప్రకటించారని తెలిపారు. వారిలో అత్యధికంగా 2,311 నగదు బహుమతులతో పాటు 12,860 మెడల్స్ శ్రీచైతన్య విద్యార్థులే సాధించారని పేర్కొన్నారు. గుంటూరు జోన్ నుంచి 87 మంది విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు 583 మంది మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీ–ఐపీఎల్, ఎంపీఎల్, ఐకాన్, సీబ్యాచ్, మెడికాన్ వంటి పటిష్ఠమైన అకడమిక్ ప్రోగ్రామ్స్‌తో అద్భుత ఫలితాలను సాధిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్ రావు, డైరెక్టర్ సుమ అభినందనలు తెలియజేశారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

పట్నంబజారు: పెళ్లి కాలేదని చెప్పి యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండకు చెందిన ఓ యువతి తండ్రి మృతి చెందడంతో జిన్నా టవర్ సెంటర్‌లో ఉన్న కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. కాకుమానువారితోటలోని ఆమె బాబాయి నివాసంలో ఉంటూ నిత్యం విధులకు వెళ్లి వస్తుంటుంది. ఈ క్రమంలో అదే కార్యాలయంలో పనిచేసే కిరణ్ తనకు పెళ్లి కాలేదని, ఆమెను వివాహం చేసుకుంటానని శారీరకంగా లోబరుచుకున్నాడు. ఆమె వద్ద నగదు, బంగారం తీసుకున్నాడు. అయితే, కొద్దిరోజుల తరువాత కిరణ్‌కు వివాహమైనట్లు బాధితురాలు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లాట్లను డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తులపై కేసు

ఒకే అపార్టుమెంట్‌లో ఫ్లాట్లను డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తులపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరండల్‌పేటలోని సుమతేజ అపార్టుమెంట్‌లో మొత్తం 24 ఫ్లాట్లు ఉన్నాయి. దీనికి సంబంధించి హరినాథ్, లలిత అనే ఇద్దరు యజమానులు ఉన్నారు. ఈ క్రమంలో 14 ఫ్లాట్లను ఇద్దరూ కలిసి విక్రయించగా, అపార్టుమెంట్‌లోని మరో పది మిగిలి ఉన్నాయి. అయితే హరినాథ్, శేఖర్ అనే వ్యక్తికి ఆరు ఫ్లాట్లకు సంబంధించి జీపీఏ రాశాడు. వీటిని అతడు ఒకరికి తెలియకుండా మరొకరికి డబుల్ రిజిస్ట్రేషన్లు చేశాడు. విషయం గమనించిన సబ్ రిజిస్ట్రార్ నన్నం అశోక్‌వర్ధన్.. డబుల్ రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు, రిజిస్ట్రేషన్ శాఖను కూడా మోసం చేసినట్లు నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతోపాటు బాధితులు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల్ని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆటల పోటీల్లో కార్పొరేషన్ స్కూలు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఇటీవల నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో కేవీపీ కాలనీలోని కేఏ స్వార్డ్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు పి. రాంబాబు తెలిపారు. బాలికల విభాగంలో వాలీబాల్, ఖోఖోలో ప్రథమ బహుమతులతో పాటు కబడ్డీ, షటిల్‌లో ద్వితీయ బహుమతులు గెలుపొందినట్లు చెప్పారు. బాలుర విభాగంలో వాలీబాల్, క్యారమ్స్‌లో ద్వితీయ బహుమతులు సాధించారని పేర్కొన్నారు. వ్యక్తిగత విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో డి.సురేంద్ర, బాలికల లాంగ్ జంప్‌లో కాశీ ఈశ్వరమ్మ తృతీయ బహుమతి, పాటల పోటీలో ఎస్.నీలిమ, మ్యూజికల్ చైర్‌లో అర్చన ప్రథమ బహుమతి, స్కిప్పింగ్‌లో మొబీన, స్లో సైక్లింగ్‌లో మస్తాన్ తృతీయ బహుమతి సాధించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని వ్యాయామ ఉపాధ్యాయులు పి.విజయకుమార్, జగదీశ్, జవహర్, లాలీ బాబు అభినందించారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి సంబరాలు



మృత్యుపత్రం నాటికలోని సన్నివేశం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ శతజయంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సభకు సంస్థ ప్రధాన కార్యదర్శి కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉప శాసన సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, సాహితీవేత్త డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు ఎన్టీఆర్ శతజయంతి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో అతిథులుగా సంస్థ గౌరవ అధ్యక్షులు అంబటి మధుమోహనకృష్ణ, దేవినేని కరుణ చంద్రబాబు, ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, వల్లభనేని కుమార్, కనిరెడ్డి తారకరామ్ పాల్గొన్నారు. అనంతరం చిలకలూరిపేటకు చెందిన మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ ప్రదర్శించిన ''మృత్యుపత్రం'' నాటిక ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. మద్దుకూరి రవీంద్రబాబు రచించగా, వై. భవాని దర్శకత్వం వహించారు.